నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
5 | నిజామాబాద్ సోమవారం 13 జనవరి 2025 | ADILABAD NIRMAL

## గ్రామాల అభివృద్ధి బాధ్యత నాదే..



రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జాదవ్ అనిల్

నేరడిగొండ, జనవరి 12 : గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నామని, ఆ బాధ్యత తనదేనని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అన్నారు. ఆదివారం పటపడితండా గ్రామానికి రూ.70 లక్షలతో చేపడుతున్న రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఒక్కో సమస్యను పరిష్కరించే దిశగా ముందుకు వెళ్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, రాంచందర్, మండల కన్వీనర్ శివారెడ్డి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ సాబ్లె నానక్‌సింగ్, నాయకులు రాథోడ్ సురేందర్, సందీప్, విజయ్, శ్రీధర్‌రెడ్డి, ప్రతాప్, కరణ్‌సింగ్, వసంత్ పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత నియమాలు పాటించాలి




మాట్లాడుతున్న ఎంవీఐ అల్లె శ్రీనివాస్

ఎదులాపురం, జనవరి 12 : ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని ఎంవీఐ అల్లె శ్రీనివాస్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మహోత్సవం సందర్భంగా ఆదివారం జడ్పీ సమావేశ మందిరంలో 'సడక్ సురక్ష అభియాన్–జాగ్రత్త'లపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రాఫిక్ నియమాలను పాటించండి ప్రమాదాలను నివారించండని సూచించారు. అనంతరం రోడ్డు భద్రతకు సంబంధించిన అంశాలపై ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంవీఐ విద్యాధర్‌రెడ్డి, టీసీ ప్రేమ్, హెచ్‌జీ ఖలీల్ ఉన్నారు.

నిర్మల్ జిల్లాలో రుణమాఫీకి నోచుకోని 30 వేల మంది రైతులు

# అన్నదాత కళ్లలో సంక్రాంతి కనుమరుగు

- గత వానకాలం సీజన్‌లో రూ.228 కోట్ల రైతుబంధు ఎగవేత
- యాసంగి పంటలు వేసి నెలరోజులవుతున్నా అందని రైతు భరోసా
- సంక్రాంతికి ఇస్తామని చెప్పి మొండిచేయి చూపిన కాంగ్రెస్ ప్రభుత్వం
- వరి రైతులకు బోనస్ చెల్లింపులోనూ తీవ్ర జాప్యం
- జిల్లాలోని 3400 మంది రైతులకు రూ.7.32 కోట్ల బకాయి
- పండుగ పూట అన్నదాతల ఆవేదన
- కేసీఆర్ ప్రభుత్వంలోనే బాగుండే అని గుర్తు చేసుకుంటున్న రైతులు



నిర్మల్ మండలంలో కొనసాగుతున్న నాట్లు

నిర్మల్, జనవరి 12(నమస్తే తెలంగాణ) : యేటా సంక్రాంతి పండుగను సంబురంగా చేసుకునే అన్నదాతలకు ఈసారి కళ తప్పినట్టయింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం వానకాలం, యాసంగి సీజన్లకు సంబంధించి క్రమం తప్పకుండా రైతు బంధు డబ్బులను జమ చేయడం, సకాలంలో రైతులకు ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచడమే కాకుండా, సాగుకు అవసరమైన సబ్సిడీలను అందజేసింది. రుణమాఫీని సక్రమంగా అమలు చేయడం, పంట రుణాలను రీ–షెడ్యూల్ చేయడం వంటి కార్యక్రమాలతో రైతులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టి అండగా నిలిచింది. అంతేకాకుండా మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలను సాగు చేసేలా రైతులను ప్రోత్సహించి వారిని లాభాల బాట పట్టించింది. దీంతో పంటలు బాగా పండి అధిక దిగుబడులు సాధించి, డబ్బులు చేతికొచ్చే సమయంలో వచ్చే సంక్రాంతి పండుగను రైతు కుటుంబాలు ఉత్సాహంగా జరుపుకునేవారు. కానీ.. గతేడాది కాలం నుంచి కాంగ్రెస్ సర్కారు నిర్వాకంతో ఏ ఒక్క రైతుకు ఇప్పటి వరకు రైతుబంధు సహాయం అందలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు స్థానంలో రైతు భరోసా పథకాన్ని అమలు చేస్తామని కొత్త తిరకాసు సృష్టించి రెండు సీజన్లకు సంబంధించిన డబ్బులను ఎగవేయడం రైతులకు శాపంగా మారింది. అసలే అప్పులతో సతమతమవుతున్న అన్నదాతలకు రైతుబంధు డబ్బులు అందకపోవడం వారిని మరింత పీకల్లోతు కష్టాల్లోకి నెట్టింది. రైతుబంధు పరిస్థితి ఇలా ఉంటే, కాంగ్రెస్ సర్కారు ఇచ్చిన రుణమాఫీ వ్యవహారం పూర్తిగా అభాసు పాలైంది. రూ.2 లక్షల లోపు రుణాలు తీసుకున్న రైతులందరికీ ఏకకాలంలో మాఫీ వర్తింపజేస్తామని హామీ ఇచ్చిన సర్కారు ఆ హామీని తుంగలో తొక్కి దశలవారీగా కొంతమందికి మాత్రమే మాఫీని వర్తింపజేయడం విమర్శలకు తావిస్తున్నది. నిర్మల్ జిల్లా వ్యాప్తంగా దాదాపు 82 వేల మంది రైతులు వ్యవసాయ రుణాలు తీసుకోగా, వీరిలో నుంచి ఇప్పటి వరకు దాదాపు 50 వేల మందికి మాత్రమే రుణమాఫీ వర్తించింది. ఇంకా 30 వేల మంది రైతులు రుణమాఫీ కోసం ఎదురు చూస్తున్నారు. తమ తోటి వారికి మాఫీ వర్తించగా, తామేం పాపం చేశామంటూ రుణ బాధిత రైతులు సర్కారుపై దుమ్మెత్తి పోస్తున్నారు. ప్రస్తుతం యాసంగి సీజన్ మొదలై నెల రోజులు గడుస్తున్నా పెట్టుబడి కోసం డబ్బులు అవసరమవుతున్నప్పటికీ, ప్రభుత్వం మాత్రం సంక్రాంతి లోపు అందిస్తామన్న రైతు భరోసా డబ్బులను ఇవ్వకుండా, ఈనెల 26 వరకు వాయిదా వేయడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే వానకాలం సీజన్‌కు సంబంధించి సన్నాలు పండించిన రైతులకు బోనస్ చెల్లింపులోనూ ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తున్నది. జిల్లాలో దాదాపు 8 వేల మంది రైతుల నుంచి 33,330 మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యాన్ని సేకరించిన ప్రభుత్వం.. ఇందుకు సంబంధించి రూ.16.25 కోట్ల బోనస్ చెల్లించాలి. అయితే ఇప్పటి వరకు 4,600 మంది రైతులకు రూ.9.34 కోట్లు చెల్లించారు. మిగతా 3,400 మంది రైతులకు రూ.7.32 కోట్ల బోనస్ డబ్బులు గత నెల రోజులుగా పెండింగ్‌లోనే ఉన్నాయి. గతంలో కేసీఆర్ ప్రభుత్వం మాట ఇచ్చిందంటే తప్పేది కాదని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం తప్పుడు మాటలతో తమను తప్పుదోవ పట్టిస్తున్నదని రైతులు మండిపడుతున్నారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో ఇలాంటి కష్టాలు ఎన్నడూ పడలేదని, అనేక రకాల పథకాలతో లబ్ధి పొందిన తమ కుటుంబాలు బాగుపడ్డాయని రైతులు గుర్తు చేసుకుంటున్నారు.

### రుణమాఫీపై తప్పుడు ప్రకటనలు

జిల్లాలో వ్యవసాయ రుణాలు తీసుకున్న రైతులందరికీ నిర్దిష్ట పరిమితికి అనుగుణంగా రుణమాఫీ వర్తింపజేస్తామని మొదట హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ హామీని పక్కన పెట్టి దశలవారీగా మాఫీని వర్తింపజేయడం తీవ్ర గందరగోళానికి దారి తీసింది. మొదట సాంకేతిక కారణాలు చూపుతూ చాలామంది రైతుల పేర్లను రుణమాఫీ జాబితాలో చేర్చలేదు. దీంతో రైతులు వ్యవసాయ శాఖ కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగారు. దీంతో బీఆర్ఎస్ నేతృత్వంలో రైతులు చాలా చోట్ల ఆందోళనలు కూడా చేపట్టి సర్కారుపై ఒత్తిడి పెంచారు. రైతుల ఆందోళనలతో దిగొచ్చిన సర్కారు అర్హులైన రైతుల జాబితాను మరోసారి రూపొందించింది. ఈ జాబితాపై కూడా చిత్తశుద్ధి కరువవడంతో ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 30 వేల మందికి పైగా రైతులు రుణమాఫీకి దూరమయ్యారు. అలాగే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వివిధ సొసైటీల్లో రుణాలు తీసుకున్నవారిలో కేవలం 36 శాతం మంది రైతులకు మాత్రమే రుణమాఫీ జరిగింది. ఆయా సహకార సంఘాల్లో దాదాపు 56 వేల మంది రైతులు రూ.498 కోట్ల రుణాలను తీసుకున్నారు. వీరందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని అధికారులు ప్రభుత్వానికి నివేదించగా, ఇప్పటి వరకు కేవలం 26 వేల మంది రైతులకు సంబంధించి రూ.185 కోట్లు మాత్రమే మాఫీ అయ్యాయి. ఇంకా 30 వేల మంది రుణమాఫీకి నోచుకోలేదు.



సోన్ మండలం సిద్దిలకుంటలో ఏపుగా పెరిగిన మక్క

### అన్నదాతకు 'భరోసా' ఏదీ..

ఎన్నికల సమయంలో పంట పెట్టుబడుల కోసం రైతులకు ఎకరానికి రూ.15వేల చొప్పున రైతు భరోసా పేరిట సహాయం చేస్తామన్న కాంగ్రెస్ పార్టీ.. అధికారంలోకి రాగానే ఆ హామీని పూర్తిగా విస్మరించిందని అన్నదాతలు విమర్శిస్తున్నారు. రైతుబంధు పేరును మార్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గత వానకాలం సీజన్‌కు సంబంధించి పెట్టుబడి డబ్బులను పూర్తిగా ఎగ్గొట్టింది. పథకం పేరును మార్చే క్రమంలో ఉద్దేశపూర్వకంగా జాప్యం చేసి ఏకంగా ఓ సీజన్ డబ్బులను ఇవ్వకుండా రైతులను మోసం చేసింది. జిల్లాలో మొత్తం 1.80 లక్షల మందికి పైగా రైతులు మొన్నటి వానకాలం సీజన్ పంట పెట్టుబడి డబ్బులు దాదాపు రూ.228 కోట్లను కోల్పోయారు. ప్రస్తుతం యాసంగి సీజన్ ప్రారంభ సమయంలోనే పెట్టుబడి డబ్బులను అందించాల్సిన సర్కారు.. పథకం పేరును మార్చడమే కాకుండా, కమిటీల పేరిట మళ్లీ కాలయాపన చేస్తుండడంపై అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. మొదట సంక్రాంతి లోపే రైతు భరోసా డబ్బులను చెల్లిస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ ఈ నెల 26కు వాయిదా వేయడంపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈసారైనా ఇచ్చిన మాటకు కట్టుబడి 26 నుంచి పెట్టుబడి సహాయాన్ని అందిస్తుందో లేదో వేచి చూడాలి.

### రైతు భరోసా వెంటనే అమలు చేయాలి..



కేసీఆర్ ప్రభుత్వం రైతుబంధు పథకాన్ని సక్రమంగా అమలు చేసి రెండు పంటలకు క్రమం తప్పకుండా పెట్టుబడి సాయాన్ని అందించేది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇప్పటి వరకు రైతులకు రూపాయి ఇవ్వలేదు. రైతుబంధు స్థానంలో రైతు భరోసా అమలు చేసి ఎకరానికి రూ.15 వేలు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు మాట మార్చి రూ.12 వేలు మాత్రమే ఇస్తామని ప్రకటించి రైతులను మోసం చేసింది. ఆ ఇచ్చే రూ.12వేలు అయినా సమయానికి ఇస్తే రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది. ఇప్పటికే యాసంగి పంటలు వేసి నెల రోజులు దాటింది. మొదట సంక్రాతికి ఇస్తామన్నరు. ఇప్పుడు 26న ఇస్తామంటున్నరు. ఇప్పటికైనా వెంటనే రైతు భరోసా అమలు చేసి రైతులను ఆదుకోవాలి.

*- కాలేవార్ రాంబాబు, రైతు, దిలావర్‌పూర్.*

### కేసీఆర్ ఉన్నప్పడే బాగుండే..



రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు అన్నీ కష్టాలే. గత 10 ఏళ్ల కేసీఆర్ పాలన ఎంతో బాగుండే. అన్ని వర్గాల ప్రజలు బాగుపడ్డరు. ముఖ్యంగా రైతులను కేసీఆర్ అన్ని విధాలుగా ఆదుకున్నడు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన రూ.2 లక్షల రుణమాఫీ కొందరికే అయింది. మా ఊరిలో దాదాపు 450 మంది రైతులు ఉంటరు. ఇందులో 170 మందికి ఇంకా రుణమాఫీ కాలేదు. రూ.2 లక్షల లోపు రుణాలున్న వారు 50 మంది దాక ఉండగా, మిగతా వారంతా రూ.2లక్షల పైన ఉన్నవారున్నారు. ఇటీవల వచ్చిన రుణమాఫీ నాలుగో జాబితాలో కూడా మా పేర్లు లేకపోవడంతో కలెక్టర్‌ను కూడా కలిసి తమకు న్యాయం చేయాలని కోరినం. అయినా ఎవరూ పట్టించుకోలేదు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ నాయకులు రూ.2 లక్షల దాక రైతులందరి రుణాలను మాఫీ చేస్తామన్నరు. ఇప్పుడు కొందరికే చేసిన్రు. మేమేం పాపం చేసినం. రుణమాఫీ లేదు, రైతుబంధు లేదు. రైతులను ఇంత ఇబ్బంది పెట్టడం కాంగ్రెసోళ్లకు మంచిది కాదు. రైతులకు అడ్డగోలు హామీలిచ్చి రేవంత్‌రెడ్డి సీఎం అయిండు. ఒక్కటి కూడా సక్కగ చేస్తలేడు. కేసీఆర్ ప్రభుత్వమే రైతులకు అన్ని విధాలుగా మంచిగుండే.

*- పోతన్న, రైతు, వాలేగాం, భైంసా మండలం.*

### బోనస్ పైసలు రాలే..



నాకు సిద్దాపూర్ శివారులో ఐదెకరాల పొలం ఉన్నది. సన్న వడ్లకు బోనస్ ఇస్తరంటే ఈసారి మొత్తం సన్నాలే ఏసిన. 88 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. సర్కారోళ్ల కాంటా పెట్టుడు లేటయితున్నదని ప్రైవేటులో రూ.2400 క్వింటాలు చొప్పున 30 క్వింటాళ్లు అమ్మేసిన. మిగిలిన 58 క్వింటాళ్ల వడ్లను నెల రోజుల కిందనే సొసైటోళ్లు కొన్నరు. వడ్ల పైసలు బ్యాంకుల జమ అయినయ్. బోనస్ పైసలు ఇంకా రాలేదు. నాకే కాదు మా ఊరిలో నాతోపాటు అమ్మిన చాలా మంది రైతులకు బోనస్ పైసలు పడలేదు.

*- అశోక్, రైతు, సిద్దాపూర్.*



స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్, మాజీ మంత్రి జోగు రామన్న

## మానవ సంబంధాలను తెలిపిన మహనీయుడు

ఎదులాపురం, జనవరి 12 : మానవ సంబంధాల గురించి ప్రపంచానికి తెలిపిన మహనీయుడు స్వామి వివేకానంద అని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఆదివారం స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని డైట్ ఎదుట గల స్వామి వివేకానంద విగ్రహం వద్ద యువజన సంఘాల నాయకులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ మంత్రి జోగు రామన్నతో కలిసి పాల్గొన్నారు. ముందుగా స్వామి వివేకానంద విగ్రహానికి పుష్పాంజలి సమర్పించి సేవలను స్మరించారు. కేక్ కట్ చేసి పలువురిని సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ధృడసంకల్పంతో ముందుకు సాగితే జీవితంలో ఏదైన సాధించవచ్చని తెలిపారు. స్వామి వివేకానంద పుస్తకాలు, సూక్తులను గుర్తు చేసుకుంటూ జీవితంలో పాటించాలని సూచించారు. అలాగే పట్టణంలోని స్యూహౌజింగ్ బోర్డు కాలనీలో గల స్వామి వివేకానంద విగ్రహం వద్ద జయంతిని నిర్వహించారు. దీనికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానంద్, ఆదినాథ్, లాలా మున్న, చిల్కూరి జ్యోతిరెడ్డి పాల్గొన్నారు.


### నమ్మకం ఉంటే ఏదైన సాధించవచ్చు..

ధైర్య సాహసాలతోపాటు నమ్మం ఉంటే ఏదైన సాధించవచ్చని స్వామి వివేకానంద చెప్పారని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. యువత వివేకానందను ఆయనను ఆదర్శంగా తీసుకుంటూ ముందుకు సాగాలన్నారు. స్వామి సూక్తులను పాటిస్తూ నిరాశ, నిస్పృహలు, ధనిక, కులబేధాలు లేకుండా ప్రశాంతంగా జీవించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారవేత్త భజరంగ్ అగర్వాల్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మాంద్, ఆధిత్య ఖండేష్కర్, ఉరే గణేశ్ పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలపై గూగుల్ మీట్

ఎదులాపురం, జనవరి 12 : రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త ఆహార భద్రత కార్డులు(రేషన్ కార్డులు), ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన విధివిధానాలపై ఆదివారం ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, అదనపు కలెక్టర్ శ్యామలదేవితో కలిసి గూగుల్ మీట్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త ఆహార భద్రత కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల వంటి కీలకమైన నాలుగు సంక్షేమ పథకాల అమలును ఈనెల 26న ప్రారంభించనున్న నేపథ్యంలో జిల్లా, మండల స్థాయి అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని, క్రియాశీల పాత్రను పోషించాలని గూగుల్ మీట్ ద్వారా పేర్కొన్నారు. గ్రామసభల నిర్వహణకు యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని, గ్రామసభలకు ఆర్ఐ, ఏఈవో, పంచాయతీ కార్యదర్శి బృందంగా ఏర్పడాలని, వార్డు సభలకు వార్డు అధికారి, డిప్యూటీ తహసీల్దార్, ఏఈ బృందంగా ఉండాలని, 4 లేదా 5 గ్రామాలకు కలిపి క్లస్టర్లవారీగా ఎంపీడీవో, తహసీల్దార్, సూపరింటెండెంట్ సమన్వయ బృందంగా నియమించాలని సూచించారు. ఈ ప్రక్రియకు సరిపడా కంప్యూటర్లను ఏర్పాటు చేయాలని, డేటా ఎంట్రీ ఆపరేటర్లను అందుబాటులోకి తీసుకోవాలని, ప్రతి క్లస్టర్ వారీగా ఒక సిస్టమ్ ఉండాలన్నారు. అలాగే ఫీల్డ్ వెరిఫికేషన్ ప్రతులు, గ్రామసభల తీర్మాన ప్రతులను జాగ్రత్తగా భద్రపరచాలని సూచించారు.

## యువత చేతుల్లోనే భవిష్యత్




మాట్లాడుతూన్న ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయమూర్తి శివరాంప్రసాద్

ఎదులాపురం, జనవరి 12 : యువత చేతుల్లోనే దేశ భవిష్యత్ ఉందని, కానీ.. యువత చెడు వ్యసనాలకు అలవాటు పడి తమ జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయమూర్తి పీ శివరాంప్రసాద్ అన్నారు. స్వామి వివేకానంద జయంతి పురస్కరించుకుని ఆదివారం ఆదిలాబాద్ జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో నేషనల్ యూత్ డే వేడుకలు నిర్వహించారు. ఈ వేడకలను ఆయన హాజరై స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయా పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులతోపాటు ఆయా రంగాల్లో రాణిస్తున్న యువకులకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు, డీఎస్పీ జీవన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## వాటర్ ట్యాంక్ ఎక్కి హల్‌చల్



వాటర్ ట్యాంక్‌పై బలిరాం

బోథ్, జనవరి 12: బోథ్ మండలం ధన్నూర్(బీ) గ్రామంలోని ఎస్సీ కాలనీకి అనుకుని ఉన్న తాగునీటి ట్యాంకుపై ఆదివారం ఓ వ్యక్తి హల్‌చల్ చేశాడు. రఘునాథ్‌పూర్ గ్రామానికి చెందిన బలిరాం కొంత కాలంగా మతిస్థిమితం కోల్పోయాడు. తనకు ముందులు అందించాలని కోరుతూ వాటర్ ట్యాంక్ ఎక్కాడు. గమనించిన చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం అందించారు. పోలీస్ సిబ్బంది అక్కడి చేరుకొని వాటర్ ట్యాంక్ ఎక్కిదించే ప్రయత్నం చేశారు. చివరికి ఒప్పించి కిందికి దించారు. సదరు వ్యక్తి కొంత కాలంగా మానసిక వ్యాధితో బాధపడుతున్నట్లు రఘునాథ్‌పూర్ గ్రామస్తులు తెలిపారు. కాగా ఎక్కిన వ్యక్తి కిందికి దిగడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.



గానుగతో నువ్వుల నూనేను తయారు చేస్తున్న తొడసం వంశీయులు



శుద్ధమైన నువ్వుల తైలాన్ని తయారు చేసిన ఆదివాసులు

## నువ్వుల తైలం తయారీలో తొడసం వంశీయులు



నవధాన్యాల నైవేద్యాన్ని తయారు చేస్తున్న ఆదివాసులు

నార్నూర్, జనవరి 12 : నార్నూర్ మండల కేంద్రంలో కొలువుదీరిన ఖాందేవ్ పుణ్యక్షేత్రంలో యేటా పుష్యమాసం పౌర్ణమిన తొడసం వంశస్తులు సంప్రదాయ పూజలు చేసి జాతరను ప్రారంభిస్తారు. నేడు జాతర ప్రారంభం కానున్న నేపథ్యంలో తొడసం వంశీయులు నువ్వుల నూనే, నవ ధాన్యాల తయారీలో నిమగ్నమయ్యారు. మహాపూజ మరుసాటి రోజు ఉదయం ఆ వంశం ఆడపడుచు నువ్వుల నూనే తాగడం ఆచారం. కనీసం మూడు కిలోల నూనే తాగుతుంది. మంగళవారం రోజున ఖాందేవ్ సన్నధిలో మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లా జివితి తాలూకా కొద్దేపూర్ గ్రామానికి చెందిన ఆ వంశానికి ఆడపడుచు మెస్రం నాగుబాయి–చందు తైలం తాగి మొక్కు చెల్లించనున్నది.